

సర్వస్వం పోయింది.. ఆదుకోండి..
వరద ఉధృతితో మోరంచపల్లి గ్రామస్తులు సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. ఆదుకోవాలని వేడుకుంటున్నారు. - 8లో



విద్యుత్ పునరుద్ధరణ పనులు...
భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు తెలిపారు. - 8లో

గరిష్ఠం/కనిష్ఠం 32°/25°
వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయి.

ఇంటింటికీ ఫీవర్ సర్వే

- 427 వైద్య బృందాల ఏర్పాటు
- 3,83,198 మందికి వైద్య పరీక్షలు
- 1,291 మందికి వైరల్ ఫీవర్
- గ్రామంలో 5–10 కేసులుంటే ప్రత్యేక వైద్య శిబిరం
- డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రశాంత్


డాక్టర్ ప్రశాంత్, డీఎంహెచ్ఓ

జనగామ: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ తెలిపారు. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా తీసుకుంటున్న జాగ్రత్తలపై శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. వివరాలు ఆయన మాటల్లోనే.. ప్రతి గ్రామంలో ఇంటింటికీ ఫీవర్ సర్వే చేయించేందుకు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో 427 వైద్య బృందాలను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు 1,78,055 గృహాల్లోని 3,83,198 మందికి వైద్య పరీక్షలు నిర్వహించాం. ఇందులో 1,291 మంది వైరల్ ఫీవర్, 138 మంది వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నట్లు గుర్తించాం. జ్వర తీవ్రతను బట్టి 776 మందికి సంబంధించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించగా అందరికీ సాధారణ జ్వరాలే అని రిపోర్టు వచ్చింది. గ్రామంలో 5 నుంచి 10 కేసులు వస్తే.. ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం. డయేరియా బాధితులను ఆస్పత్రుల్లో అడ్మిట్ చేసుకుని చికిత్స అందిస్తున్నాం. డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా కేసులు నమోదైతే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రతి పీహెచ్‌సీలో 10వేల మలేరియా కిట్లు అందుబాటులో ఉన్నాయి.

తాత్కాలిక కార్మికులతో శానిటేషన్ పనులు

- 802 మందితో పారిశుద్ధ్య నిర్వహణ
- రెండురోజులకు ఒకమారు ఇంటింటా చెత్త సేకరణకు చర్యలు
- జిల్లా పంచాయతీ అధికారి రంగాచారి


రంగాచారి
పంచాయతీ అధికారి

జనగామ: గ్రామపంచాయతీ కార్మికులు సమ్మెలో ఉన్నప్పటికీ శానిటేషన్ సమస్య తలెత్తకుండా తాత్కాలిక కార్మికులతో పనులు చేయిస్తున్నామని డీపీఓ రంగాచారి తెలిపారు. భారీ వర్షాలు, జీపీ కార్మికుల సమ్మె నేపథ్యంలో గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్య విషయమై శనివారం 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు. అవి ఆయన మాటల్లోనే.. జిల్లా పరిధి 281 జీపీల్లో 1,142 మంది కార్మికులు ఉండగా, అందరూ సమ్మెలో ఉన్నారు. దీంతో ఉపాధి కూలీలు, తదితరులు మొత్తం 802 మందితో అన్ని జీపీల్లో శానిటేషన్ పనులు చేయిస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరణ రెండు రోజులకు ఒకమారు చేపట్టేలా దృష్టి సారించాం. వానాకాలం నేపథ్యంలో రోడ్లపై నిలిచి న నీటితో పాటు డ్రెయినేజీ నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వరద నీరు బయటకు వెళ్లే దారిలేని ప్రాంతాల్లో లార్వాను చంపేసి దోమలు వ్యాప్తి చెందకుండా 1000 ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. వీధులు, చెత్తకుప్పల ప్రాంతాల్లో మలాథియన్ స్ప్రే చేయిస్తున్నాం. వాటర్‌లో క్రమం తప్పకుండా బ్లీచింగ్ మెయింటనెన్స్‌పై దృష్టి పెట్టాం. కాచి చల్లార్చి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆహార పదార్థాలపై దోమలు, ఈగలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేస్తున్నాం. చేతుల శుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నాం.

న్యూస్‌రీల్

వైభవంగా వార కల్యాణం



చిల్పూరు: శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు వారకల్యాణం వైభవంగా నిర్వహించారు. ధర్మసాగర్ మండలం మడికొండకు చెందిన ఆమంచ రామకృష్ణ –అశ్విని, వెంకటేశం–విజయలక్ష్మి దంపతులు 40 గ్రాముల బంగారు గొలుసును మొక్కుబడిలో భాగంగా స్వామివారికి సమర్పించారు. కల్యాణానికి వచ్చిన భక్తులకు కరీంనగర్ జిల్లా మల్లాపూర్‌కు చెందిన వేల్మల అనంతరామారావు–వసంతాదేవి కుమారుడు జగదీశ్వర్‌రావు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

సోమేశ్వరుడికి పూజలు



పాలకుర్తి టౌన్: శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామిని శనివారం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఏలే బాలకృష్ణ, నాగసుప్రియ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి అర్చకులు ప్రసాదం అంజేశారు. ఈఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

జనగామ రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న 'ప్రజావాణి' రద్దు చేసినట్లు కలెక్టర్ శివలింగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలు, అలాగే ఎన్నికల శిక్షణ తరగతులకు జిల్లా స్థాయి అధికారులను కేటాయించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

జనగామ: ఆర్టీసీ సేవలు, సమస్యలపై ప్రయాణికుల నుంచి తెలుసుకోవడానికి ఆదివారం(నేడు) 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిపో పరిధి అన్ని మండలాల ప్రజలు, దివ్యాంగులు, విద్యార్థులు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు 99592 26050 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

ఆర్టీసీ రక్షణకు పోరాడాలి

జనగామ రూరల్: ఆర్టీసీ రక్షణకు ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవనంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ ప్రైవేటీకరణకు కుట్ర జరుగుతోందని, అందులో భాగంగా ప్రభుత్వం 35శాతం బస్సులను ప్రైవేట్ యాజమాన్యాలకు అప్పగించిందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సాధిక్ అలీ, డాక్టర్ లక్ష్మీనారాయణ, రాజమౌళి, సుధాకర్, జనార్దన్, సోమయ్య, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాకాలనీ వాసుల రాస్తారోకో



జనగామ: మూసివేసిన తమ కాలనీ దారి తెరిపించాలని కోరుతూ పట్టణ పరిధి సూర్యాపేటరోడ్డు శ్రీదుర్గాకాలనీ వాసులు తలపెట్టిన నిరవధిక రిలే దీక్షలు శనివారం 14వ రోజు కొనసాగాయి. అధికారులు పట్టించుకోవడం లేదని నిరసిస్తూ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాలనీ వాసులు మాట్లాడుతూ 150 కుటుంబాలు ఉంటున్న కాలనీకి దేవాదాయశాఖ అధికారులు దారి లేకుండా చేశారని వాపోయారు. దారి తెరిపించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్‌ఐ సృజన్‌కుమార్ అక్కడికి చేరుకుని నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు.

ఆదిలాబాద్ ఎంపీపై ఫిర్యాదు

జనగామ: లంబాడీ గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాబూరావుపై చర్య తీసుకోవాలని సంఘం ప్రతినిధులు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు, డాక్టర్ లక్ష్మీనారాయణనాయక్, అజ్మీరా స్వామినాయక్, కౌన్సిలర్ వాంకుడోతు అనిత, భిక్షపతి, భూక్య వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ ఆర్డీఓగా రామ్మూర్తి

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ ఆర్డీఓగా వాసం రామ్మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో భాగంగా నర్సంపేట తహసీల్దార్‌గా పనిచేస్తున్న రామ్మూర్తికి ఆర్డీఓగా పదోన్నతి కల్పించింది.

కొట్టుకుపోతున్నా పట్టదా..!

జిల్లాలో ప్రమాదకరంగా లో లెవల్ కాజ్‌వేలు.. వంతెనలు

- వరద వస్తే రాకపోకలు ఉండవు
- స్పందించని పాలకులు, అధికారులు
- తాత్కాలిక చర్యలతోనే సరిపెడుతున్న వైనం

సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్నామని గొప్పలు చెప్పుకునే పాలక ప్రభుత్వాలు భారీ వర్షాలు కురిస్తే రాకపోకలకు అంతరాయం లేకుండా చేయలేక పోతున్నాయి. జాతీయ, రాష్ట్ర, గ్రామీణ రహదారుల వెంట వందలాది కల్వర్టులు.. లో లెవల్ కాజ్‌వేలు వరద ముంపునకు గురవుతూ రోజుల తరబడి ప్రయాణాలు ఆగిపోతున్న పరిస్థితి జిల్లాలో నెలకొంది. ఏటా వర్షాకాలంలో ఊర్లకు సంబంధాలు తెగిపోతున్నా తాత్కాలిక చర్యలు తప్ప.. శాశ్వత పరిష్కారం వైపు ఆలోచించడంలేదు. ఇటీవల దంచికొట్టిన వానలతో లింగాలఘణపురం, జఫర్‌గఢ్, జనగామ, బచ్చన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, రఘునాథపల్లి ఇలా అనేక మండలాల పరిధిలో సుమారు 100 గ్రామాలకు పైగా రెండు నుంచి మూడు రోజుల పాటు సంబంధాలు తెగిపోయాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో వంతెనలు, కల్వర్టుల వద్ద నెలకొన్న పరిస్థితులపై ప్రత్యేక కథనం.
- జనగామ

సాక్షి పరిశీలన

ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు శాపంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారి స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండ హైవే క్రాస్‌రోడ్డు సమీపాన రోడ్డును వరద ముంచెత్తింది. రోడ్డు నిర్మాణ సమయంలో వరద నీరు వెళ్లేందుకు చిన్నపాటి పైపులైన్లు ఏర్పాటు చేశారు. భారీ వరద తన్నుకు రావడంతో సామర్థ్యం లేని పైపులతో.. నీరంతా రోడ్డుపైకి చేరింది. వరద వచ్చినప్పుడల్లా రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఎంతో గొప్పగా చెప్పుకునే జాతీయ రహదారి పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామాల్లో లింకురోడ్ల గతేంటని ప్రజలు సెటైర్లు వేస్తున్నారు.

రెండు గంటలు ట్రాఫిక్‌లోనే..



మీదికొండ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఐదు రోజుల క్రితం మీదికొండ క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారి పైనుంచి వరద ఉధృతి కారణంగా రెండు గంటల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాను. జాతీయ రహదారిపై ఇటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.
- బత్తినిరాజు, ఆటోడ్రైవర్, రాఘవాపూర్



పై ఫొటోలో కనిపిస్తున్నది సూరారం రోడ్డు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కోతకు గురైంది. ద్విచక్ర వాహనాలు మినహా మరే వాహనాలు నడిచే పరిస్థితి లేదు. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. సూరారం నుంచి జఫర్‌గఢ్‌తో పాటు హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తికి సైతం ఇక్కడి నుంచే వెళ్లాలి. రోడ్డు కోతకు గురికావడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులను నిలిపి వేశారు. దెబ్బతిన్న రహదారిని బాగుచేసి రాకపోకలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.
– జఫర్‌గఢ్

అవస్థలు పడుతున్నాం..



ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు మరో మూడు చోట్ల కోతకు గురై అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు గుండా పెద్ద వాహనాలు వెళ్లడం లేదు. రోడ్డు బాగుచేసేందుకు ఎవరూ పట్టించుకోవడం లేదు. మరో పెద్ద వర్షం వస్తే రోడ్డు రూపురేఖలు కూడా కనిపించవు. నాలుగు సంవత్సరాలుగా ఇవే ఇబ్బందులు పడుతున్నాం.
- ఎండీ.అంజద్‌పాషా, సూరారం



హైవే కింద నుంచి నీరు వెళ్లేందుకు వేసిన చిన్న పైపులైన్


పటేల్‌గూడెం కాజ్‌వే వరదలో నుంచి వస్తున్న ప్రజలు

నాలుగు రోజులు గడిచినా..

లింగాలఘణపురం : కుందారం–పాలకుర్తి రోడ్డులోని పటేల్‌గూడెం వాగుపై ఉన్న లో లెవల్ కాజ్‌వే ఇబ్బందికరంగా మారింది. జనగామ చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు ఎత్తడంతో నెల్లుట్ల వాగు మీదుగా పటేల్‌గూడెం కాజ్‌వే పైనుంచి వరద నవాబుపేట రిజర్వాయర్‌లోకి చేరుతుంది. ఇక్కడి నుంచి కుందారం, కిష్టగూడెం, డీకేతండా, చీటూరు, అప్పిరెడ్డిపల్లి, పాలకుర్తికి వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోతాయి. గత ఏడాది మూడు రోజులు, ఈసారి నాలుగు రోజులు గడిచినా నేటికీ రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. పాలకుర్తికి వెళ్లేవారు నేలపోగుల, అప్పిరెడ్డిపల్లి మీదుగా ప్రయాణిస్తున్నారు. కుందారం, కిష్టగూడెం, డీకేతండా, చీటూరు గ్రామాల ప్రజలు జనగామ, లింగాలఘణపురం మండల కేంద్రానికి వెళ్లాలంటే దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి, చిన్నమడూరు, నేలపోగుల మీదుగా రావాల్సి ఉంటుంది. అంటే గతంలో 13 కిలోమీటర్ల దూరం ఉంటే ప్రస్తుతం 35 కిలోమీటర్లకు పెరిగింది. కాజ్‌వేపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు కాగా, వరద తగ్గిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని ఆర్‌అండ్‌బీ డీఈ అశోక్ వివరించారు.

35 కి.మీ. ప్రయాణించాల్సి వస్తున్నది



గతంలో తండా నుంచి కుందారం, నెల్లుట్ల మీదుగా అటు మండల కేంద్రం, ఇటు జనగామ పోయేటోళ్లం. అప్పుడు 11 కిలోమీటర్లు మాత్రమే వచ్చేది. ప్రస్తుతం వరదతో పటేల్‌గూడెం వాగువద్ద రాకపోకలు నిలిపి వేయడంతో కుందారం, కిష్టగూడెం, చీటూరు, దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి, చిన్నమడూరు, లింగాలఘణపురం మండలం నేలపోగుల, వడిచర్ల, నవాబుపేట, నెల్లుట్ల మీదుగా తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది.
- ధరావత్ భీమా, డీకేతండావాసి

ఇదొక్కటే మార్గం..

జనగామ రూరల్: పక్క ఫొటోలో కనిపిస్తున్నది జనగామ మండలం చీటకోడూరులోని వాగు. ఇక్కడి కల్వర్టు పైనుంచి చీటకోడూరు, చౌడారం, మరిగడి, లక్ష్మీతండా, రామన్నగూడెం, మాదారం, దాసన్నగూడెం, ఖిలాషాపూర్, నర్మెటకు ప్రజలు.. చౌడారంలోని కస్తూర్బా, మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రయాణిస్తారు. ఎగువ నుంచి వరద, పైన ఉన్న చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు ఎత్తిన సమయంలో వచ్చే నీటితో ఏడాదిలో నాలుగైదు సార్లు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. 150 మంది పాల వ్యాపారులు, ఉపాధి కూలీలు, ఉద్యోగులు, రైతులు, కార్మికులకు ఇదొక్కటే 'మార్గం'. ప్రస్తుతం ఐదు రోజులుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం కల్వర్టుపై వరద ఉధృతి పెరిగిన సమయంలో రాకపోకలు నిలిపి వేసి.. ఆ తర్వాత కొనసాగిస్తారు. ప్రస్తుతం కల్వర్టు కోతకు గురై సీసీబెడ్డు కొట్టుకుపోయే ప్రమాదం నెలకొంది.

కల్వర్టు పైనుంచి ప్రవహిస్తున్న చీటకోడూరు వాగు


గేట్లు ఎత్తితే రాకపోకలు బంద్



రోజూ 20 లీటర్ల పాలు జిల్లా కేంద్రానికి తీసుకెళ్లాలి. భారీ వానలు కురిసినప్పుడు చీటకోడూరు రిజర్వాయర్ గేట్లు ఎత్తితే మూడు నాలుగు రోజులు రాకపోకలు నిలిచిపోతాయి. ఇబ్బందులు తప్పడంలేదు.
- ఎల్లబోయిన ప్రసాద్, చీటకోడూరు

చిన్న వర్షానికే వరద ఉధృతి

బచ్చన్నపేట: మండల కేంద్రం నుంచి కొన్నెకు వెళ్లే మార్గంలో రెండు వాగులు, లో లెవల్ కల్వర్టులు ఉన్నాయి. ఇక్కడ చిన్న పాటి వర్షంతోనే వరద ఉధృతి విపరీతంగా ఉంటుంది. ఈ కల్వర్టుల మీదుగా ఇటుకాలపల్లి, రామచంద్రాపూర్, కొన్నె, పడమటికేశ్వాపూర్, నాగిరెడ్డిపల్లి, మన్సాన్‌పల్లి, సాల్వాపూర్‌తో పాటు సిద్దిపేట జిల్లా గజ్వేల్, కొండపోచమ్మ, యాదాద్రి జిల్లా రాజపేట, యాదగిరిగుట్ట గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగుతూ ఉంటాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నాలుగు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి, కాగా చుంచనకోటకు చెందిన ఆటో వాగులో కొట్టుకుపోగా, డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. రైతులు, గీత కార్మికులు, అనేక మందికి ఇదొక్కటే మార్గం. వంతెనల నిర్మాణం ఒక్కటే పరిష్కారం.

నక్కవానిగూడెం రోడ్డు లో లెవల్ కల్వర్టు వద్ద..


వంతెనలు నిర్మించాలి..



వర్షం వచ్చినప్పుడల్లా రాకపోకలు నిలిచి పోతున్నాయి. లోలెవల్ కాజ్‌వేలతో ప్రజలు, వాహనచోదకులు పడుతున్నారు. బచ్చన్నపేటకు పనుల నిమిత్తం రావాలంటే వరద ఉధృతి దాటనివ్వడం లేదు. 30 కిలోమీటర్ల మేర తిరిగి రావాల్సి వస్తున్నది. వంతెనలు నిర్మించి సమస్య పరిష్కరించాలి.
- కొమురవెల్లి శ్రీనివాస్, మన్సాన్‌పల్లి

ఎర్రగొల్లపహాడ్‌-పెద్దతండా(వై) కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి


చీటకోడూర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

- అభివృద్ధికి కేంద్రం నిధులు ఇవ్వాలి
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ రూరల్: భారీ వర్షాలతో జనగామ మండలం చీటకోడూర్ వాగు ప్రాంతంలో దెబ్బతిన్న ఎర్రగొల్లపహాడ్–పెద్దతండా(వై) కల్వర్టును శనివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.8 కోట్ల అంచనాతో సంబంధిత డీఈ, అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాల కారణంగా నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టులు నేడు దెబ్బతింటున్నాయని, మండల పరిధిలో పలు కల్వర్టుల నిర్మాణానికి రూ.10కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. రైతుల మేలు కోసం చెక్ డ్యాముల్లో నీరు నిలచేలా.. అలాగే పైనుంచి వాహనాలు వెళ్లే విధంగా నిర్మాణం చేపడతామన్నారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు విమర్శలు కాకుండా.. దమ్ముంటే నిర్మాణాలకు కేంద్రం నుంచి తెలంగాణకు నిధులు తీసుకురావాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల కళింగరాజు, రైతు బంధు మండల కోఆర్డినేటర్ బూరెడ్డి ప్రమోద్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రశాంత్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన
పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు, సెయింట్ మేరీస్ స్కూల్ తదితర ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శనివారం పర్యటించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదతో పాటు డ్రెయినేజీల్లో నిలిచిన నీటిని పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సిల్ట్‌ను తొలగించి, వరద నీరు రోడ్లపైకి రాకుండా చూడాలని కోరారు. వరద కష్టాలు తొలగేలా ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రణాళికలను తయారు చేస్తున్నామని చెప్పారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే
జిల్లా కేంద్రం 26వ వార్డులో శనివారం రాత్రి జరిగిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పాల్గొన్నారు. పీరీలకు దట్టీలు, పూలు సమర్పించిన అనంతరం అల్వాలో పాల్గొని చుట్టూ తిరిగారు.

బాధితులను ఆదుకోవడంలో విఫలం

జీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు


మాట్లాడుతున్న విజయరామారావు

స్టేషన్‌ఘన్‌పూర్: భారీ వర్షాల నేపథ్యంలో బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వారం రోజులుగా కురిసిన వర్షాలు, వరదలతో వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ప్రజలకు అపారమైన నష్టం జరిగిందన్నారు. అధికారికంగా 25 మంది మృత్యువాత పడగా.. అనధికారికంగా దాదాపు వంద మంది మరణించి ఉంటారని తెలిపారు. వందల సంఖ్యలో ఇళ్లు కూలిపోయి.. లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగిందని పేర్కొన్నారు. బాధితులను అన్ని విధాల ఆదుకునేలా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్‌బెడ్రూం కట్టుకునేలా రూ.6లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొజ్జపల్లి సుభాష్, ఐలోని అంజిరెడ్డి, ఇనుగాల యుగేందర్‌రెడ్డి, గట్టు కృష్ణ, రడపాక ప్రదీప్, తాళ్లపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

2,449 ఎకరాల్లో పత్తి, వరి పంటలకు నష్టం

- వెల్లడించిన జిల్లా వ్యవసాయ అధికారి

జనగామ/దేవరుప్పుల: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో 2,449 ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని డీఏఓ వినోద్‌కుమార్ శనివారం వెల్లడించారు. వరి పంట జనగామలో 55, నర్మెట 45, తరిగొప్పుల 20, స్టేషన్‌ఘన్‌పూర్ 530, పత్తి పంట 200, చిల్పూరులో వరి 773, పత్తి 280, పాలకుర్తిలో వరి 185, దేవరుప్పులలో వరి 59, పత్తి 47, కొడకండ్లలో వరి 178, పత్తి 77 ఎకరాల్లో నష్టం జరిగినట్లు వివరించారు.

పంటంతా కొట్టుకుపోయింది: రైతు లేఖ
ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు మూడెకరాల్లో సాగు చేసిన వరి, పత్తి పంటలు పూర్తిగా కొట్టుకుపోయి.. పొలంలో ఇసుక మేటలు పేరుకుపోయాని దేవరుప్పుల మండలం కోలుకొండ గ్రామానికి చెందిన రైతు కన్నెబోయిన నర్సయ్య శనివారం కలెక్టర్ శివలింగయ్యకు లేఖ రాశాడు. భూమి కోతకు గురైందని, మిగిలిన పంటపైనా ఇసుక కప్పిందని పేర్కొన్నాడు. పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వేడుకున్నాడు.

పశువుల కొట్టాలుగా డబుల్ బెడ్రూం ఇళ్లు

రఘునాథపల్లి: డబుల్‌బెడ్రూం ఇళ్లు పశువుల కొట్టాలుగా మారాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర, అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. శనివారం కంచనపల్లిలో పనులు నిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లను వారు పరిశీలించి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాలను తెలంగాణ ప్రభుత్వం లాగేసుకొని వారి పొట్టగొట్టిందని విమర్శించారు. ప్రభుత్వ పథకాలన్నీ ఎమ్మెల్యేల కమీషన్ల కోసమే అన్నట్టుగా ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ విమర్శలు చేసుకోవడంతోనే సరిపోతోందని ధ్వజమెత్తారు. నాయకులు జగదీష్‌చందర్‌రెడ్డి, శివరాజ్‌యాదవ్, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


డబుల్‌బెడ్రూంలో గొర్రెను చూపుతున్న నాయకులు

క్లుప్తంగా

పలు రైళ్లు రద్దు

● జూలై 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు..



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సబ్ డివిజన్ పరిధిలో రైల్వే ట్రాక్ నిర్వహణతో పాటు మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల నేపథ్యంలో పలు ప్యాసింజర్ రైళ్లను జూలై 31 నుంచి ఆగస్టు 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ మేరకు కాజీపేట రైల్వే అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం విచారణ కౌంటర్ వద్ద రైళ్ల రద్దు బోర్డును డిస్‌ప్లే చేశారు.

రద్దయిన రైళ్ల వివరాలు

కాజీపేట–డోర్నకల్ ప్యాసింజర్ (07753), డోర్నకల్–కాజీపేట (07754) ప్యాసింజర్, సికింద్రాబాద్–వరంగల్ (07462) పుష్‌పుల్, వరంగల్–సికింద్రాబాద్ (07463) పుష్‌పుల్, కాజీపేట–సిర్పూర్ (17003) సింగరేణి, సిర్పూర్ –కాజీపేట (17004) సింగరేణి, కాజీపేట–బల్లార్షా (17035), బల్లార్షా –కాజీపేట (17036), భద్రాచలంరోడ్–బల్లార్షా (17033), బల్లార్షా–భద్రాచలంరోడ్ (17034) సింగరేణి రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

● పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30 ,31 ఆగస్టు 1, 2 తేదీల్లో నిర్వహించనున్న వివిధ పరీక్షలను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ, ఫార్మడీ, బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ సెమిస్టర్ పరీక్షలు, పీజీ కోర్సులకు సంబంధించి నాలుగో సెమిస్టర్ ప్రాక్టికల్స్ పరీక్షలు, లా ఫైనల్ విద్యార్థులకు మూట్‌కోర్టు పరీక్షలు వాయిదా వేసినట్లు వివరించారు. వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేశామన్నారు. వాయిదాపడిన పరీక్షలను తిరిగి నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు.

సర్వస్వం పోయింది.. ఆదుకోండి..

● ఆపన్నహస్తం కోసం మోరంచపల్లి వాసుల ఎదురుచూపు
● ముందుకు వస్తున్న నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు
● నిత్యావసరాలు పంపిణీ చేయని అధికారులు
● నష్టపరిహారం అందించాలని వేడుకుంటున్న బాధితులు

కన్నీటి గాథ



వరదల్లో కొట్టుకుపోయిన చెంచు కాలనీ



తడిసిన పాడైన సూపర్‌మార్కెట్ సామగ్రి

భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామస్తులు వరద ఉధృతిలో సర్వం కోల్పోయారు. కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. వరదలో నిత్యావసరాలు, వాహనాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను కోల్పోయారు. కట్టుకోవడానికి బట్టలు.. కప్పుకోవడానికి దుప్పటి కుడా లేని దుస్థితి నెలకొంది. వరదల నుంచి తేరుకొని మూడు రోజులు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో నష్టపరిహారం ఇస్తుందా లేదా అని బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఆపన్నహస్తాల కోసం ఎదురు చుస్తున్నారు. గ్రామంలో ఏ ఒక్కరిని కదిలించినా క'న్నీరే' ఉబికి వస్తోంది. కాగా, నిత్యావసర వస్తులు అందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు.

ప్రభుత్వం నుంచి అందని తక్షణ సాయం

ఊరికి ఊరంత వరదలో మునగడంతో కట్టుబట్టలతో బయటికి వచ్చిన బాధితులకు ప్రభుత్వం నుంచి కనీసం తక్షణ సాయం కూడా అందలేదు. నిత్యావసర వస్తువులు, బియ్యం కూడా పంపిణీ చేయలేదు. నష్టపోయిన ఆస్తికి, పశువులకు పరిహారం కింద ఆర్థిక సాయం అందించాలని కోరుతున్నారు.

10 ఇళ్లు వరద తాకిడి దెబ్బతినగా చెంచుకాలనీకి చెందిన 18 గుడిసెలు వరదలో కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో బాధితులు అందోళన చెందుతున్నారు. ఒక్కొక్క ఇంటిలో రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు నష్టం జరిగినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోరంచపల్లి బస్టాండ్ సమీపంలోని సంతోషిమాత సూపర్‌మార్కెట్‌లో రూ. 20లక్షల విలువైన కిరాణా సామగ్రి తడిసి పాడైంది.

ముందుకు వస్తున్న పలువురు..

మోరంచపల్లిలో జరిగిన నష్టాన్ని చూసిన పలువురు చలించిపోతున్నారు. పగవారికి కూడా ఇలాంటి కష్టం రావొద్దని వేడుకుంటున్నారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల నాయకులు ముందుకు వచ్చి బియ్యం, కూరగాయలు, వంట సామాను, చద్దర్లు, మ్యాట్లు, పండ్లు, పప్పులు, చీరలు, ఇతర వస్తువులు ఇంటింటికీ తిరుగుతూ బాధితులకు అందజేస్తున్నారు.

రూ.20 లక్షల నష్టం జరిగింది



మోరంచపల్లిలో వచ్చిన వరదతో మా సూపర్‌మార్కెట్‌లో రూ.20లక్షల విలువైన వస్తువులు తడిసి పాడయ్యాయి. చక్కెర, పప్పు, పిండి, బియ్యం ఇతర వస్తువులు పాడయ్యాయి. అప్పు తెచ్చి షాపు ఏర్పాటు చేసుకున్న. వస్తువులు కొనుగోలు చేసిన సెట్లకు ఇంకా డబ్బు ఇవ్వలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

–దొడ్డశాని సంతోష్, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు

ఇంటికి రూ. 4లక్షలు ఇవ్వాలి



వరద ఉధృతిలో సర్వం కోల్పోయాం. ప్రతి ఇంటికీ ప్రభుత్వం రూ.4లక్షలు ఇచ్చి ఆదుకోవాలి. వరదలో 3 తులాల బంగారం, రూ.15వేల నగదు, వంట గ్యాస్, భూమి పాస్‌పుస్తకాలు, ఇతర వస్తువులు కొట్టుకుపోయాయి. మిగిలిన వస్తువులను కడుకుంటున్నాం. ఇప్పటికీ ఒక్క అధికారి కూడా వచ్చి నష్టం గురించి సర్వే చేయలేదు.

–సూరం రాజయ్య, వరద బాధితుడు

రూ.3 లక్షల నష్టం జరిగింది



వరద కారణంగా కొన్ని వస్తువులు తడిశాయి. మరి కొన్ని వస్తువులు కొట్టుకుపోయాయి. రూ.లక్ష విలువైన బండి కొట్టుకుపోయింది. ఫ్రిడ్జి, కూలర్, బట్టలు, ఇతర వస్తువులు తడిశాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి వరకు నష్టం జరిగింది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి.

–కోటగిరి తిరుమల, మోరంచపల్లి వరద బాధితురాలు

గ్రామాన్ని తరలించాలి..



2001లో గ్రామానికి భారీ స్థాయిలో వరదలు వచ్చాయి. అప్పుడే గ్రామాన్ని తరలించాలని వేడుకున్నాం. అయినా అధికారులు పట్టించుకోలేదు. మూడు రోజుల క్రితం వచ్చిన వరదలకు గ్రామంలో నలుగురు కొట్టుకుపోయారు. గ్రామస్తులమందరం సర్వం కోల్పోయి కట్టుబట్టలతో పునరావాస కేంద్రాల్లో ఉంటున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం మోరంచపల్లి గ్రామాన్ని తరలించాలి.

–కర్ర పుష్పలీల, మోరంచపల్లి వరద బాధితురాలు

కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని..

● విద్యార్థి ఆత్మహత్య

హసన్‌పర్తి: కాలేజీ యాజమాన్యం పరీక్ష ఫీజు తీసుకోవడం లేదని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా 56వ డివిజన్ పరిమళ కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. మృతుడి తండ్రి శనివారం కేయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాలనీకి చెందిన కందకట్ల జనార్దన్ కుమారుడు గౌతం (21) నగరంలోని వాగ్దేవి కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తున్నాడు. హాజరు నమోదు తక్కువగా ఉండడంతో ఎగ్జామ్స్ ఫీజు తీసుకోవడానికి యాజమాన్యం నిరాకరించింది. దీంతో మనోవేదనకు గురైన గౌతం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

పలువురి గల్లంతు.. మృతదేహాలు లభ్యం

భారీ వర్షాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల గల్లంతైన పలువురి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి.



లక్ష్మి(ఫైల్)

వెంకటాపురం(ఎం): మండలంలోని నల్లగుంట పరిధి బిలుగుకుంటలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. నల్లగుంట గ్రామానికి చెందిన సాద లక్ష్మి గత గురువారం బిలుగుకుంట వైపు వెళ్లి కాలువలో పడి వరదలో కొట్టుకుపోయింది. కాగా, మూడు రోజులుగా కుటుంబ సభ్యులు.. లక్ష్మి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికారు. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శనివారం ఉదయం నీటి వనరుల్లో వెతకగా బిలుగుకుంటలో లక్ష్మి మృతదేహం కనిపించింది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వెంకటాపురం ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.

నడికూడలో గుర్తుతెలియని మహిళ మృతదేహం..

నడికూడ: మండల కేంద్రంలోని పెద్ద చెరువు పక్కన గల చింతలపల్లి భీమ్‌రావు పొలంలోకి శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం వరదకు కొట్టుకొచ్చింది. దీనిని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. కేవలం అస్థిపంజరంతో ఉన్న మృతదేహాన్ని సీఐ వెంకట్ రత్నం, ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ పంచనామా నిర్వహించి ఖననం చేశారు. అనంతరం వీఆర్‌ఏ అంబి వనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.

జంపన్నవాగులో వ్యక్తి మృతదేహం..

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని గోనెపల్లి గొత్తికోయ గూడేనికి చెందిన నందయ్య (50) మృతదేహం లభ్యమైంది. మేడారం జంపన్నవాగు సమీపంలోని మామిడి తోటకు కాపాలా ఉంటున్న ఆయన.. గురువారం జంపన్నవాగు వరదలో గల్లంతయ్యాడు. వరద తగ్గడంతో వాగు పక్కన ఇసుకలో శనివారం నందయ్య మృతదేహం లభ్యమైంది. పోలీసులు మృతదేహం బయటకు తీసి పంచనామా నిర్వహించారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

● బాధితులకు ప్రభుత్వం అండ
● నష్టం అంచనా వేశాం.. త్వరలో పరిహారం
● రాజకీయాలకు ఇది సమయం కాదు
● రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

హన్మకొండ అర్బన్ : వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో వారం రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఊహించని విధంగా ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని, బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో ప్రాథమికంగా రూ.414 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేశామన్నారు. ఇందులో వరంగల్ జిల్లాలో రూ.89 కోట్లు, హనుమకొండలో రూ.146 కోట్లు, గ్రేటర్ పరిధిలో రూ.179 కోట్లు అంచనా వేశామన్నారు. 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4668 మంది బాధితులను తరలించామన్నారు. గ్రేటర్ పరిధిలో 38 రెస్క్యూ టీమ్‌ల ద్వారా 2,055 మందిని రక్షించామని తెలిపారు. 207 ఇళ్లు పూర్తిగా, 480 ఇండ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయని అధికారులు అంచనా వేసినట్లు తెలిపారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. త్వరలో పరిహారం అందజేస్తామని తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ ముందు చూపుతో ప్రమాదం తప్పిందన్నారు. భద్రకాళి చెరువుకు గండి పండిదనే విషయం తెలుసుకున్న అధికారులు.. ప్రాణహాని కలుగకుండా వెంటనే చర్యలు చేట్టారన్నారు. వరద బాధితులకు సహకారం అందజేస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్‌లో ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు 14 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. 154 ప్రాంతాలు జలమయయ్యాయని తెలిపారు. బీటీ రోడ్లు 38 కిలో మీటర్లు, సీసీ రోడ్లు 43 కిలోమీటర్లు, మెటల్ రోడ్లు 95 కిలో మీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. వర్షాలకు వరంగల్‌లో ఒకరు, హనుమకొండలో ఆరుగురు మృతి చెందారన్నారు. హనుమకొండలో 4137 చెరువులు దెబ్బతిన్నాయన్నారు. ఆర్‌అండ్‌బీకి సంబంధించి వరంగల్‌లో 22 కిలోమీటర్లు, హనుకొండలో 22 కిలోమీటర్లు ధ్వంసమయ్యాయన్నారు. పంట నష్టం కూడా అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి పంపామని తెలిపారు. ఈ సమయంలో ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ ప్రజలను రెచ్చగొట్టొద్దని, సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్నారు. భద్రకాళి చెరువు మరమ్మతులు వెంటనే చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, చల్లా ధర్మారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు అస్వస్థత





చికిత్స పొందుతున్న మీనాక్షి, రుత్విక

గూడూరు: మండలంలోని బ్రాహ్మణపల్లి కస్తూర్బా విద్యాలయంలో శుక్రవారం రాత్రి ఇద్దరు బాలికలు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఊట్లకు చెందిన బానోతు మీనాక్షి ఇంటర్ మొదటి సంవత్సరం, బ్రాహ్మణపల్లికి చెందిన మేరుగు రుత్విక అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. ఇద్దరు కొంత కాలంగా శ్వాస కోశ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో బాలికలు శ్వాసకు ఇబ్బందులు పడుతున్నారు. దీనిని గుర్తించిన ఉపాధ్యాయులు వెంటనే గూడూరు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుడి సూచన మేరకు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం బాలికలు ఆరోగ్యంగా ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు ముమ్మరం

● టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు



తడిసిన రికార్డులను పరిశీలిస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావు

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ పునరుద్ధరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయంగా పని చేస్తున్నారని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. శనివారం వరంగల్ బొంది వాగులో కూలిన 33 కేవీ లైన్ విద్యుత్ టవర్‌ను పరిశీలించారు. అనంతరం వరంగల్ పోతన నగర్‌లో నీటి మునిగిన విద్యుత్ ఈఆర్ కార్యాలయాన్ని సందర్శించారు. తడిచిన రికార్డులు పరిశీలించారు. రికార్డులు తడి ఆరబెట్టి భద్రపరచాలని సూచించారు. అదే విధంగా వరద ఉధృతి తగ్గిన తర్వాత బొంది వాగులో కూలిన టవర్ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని చోట్ల విద్యుత్ సరఫరా అందించగలిగామని, 24/7 ఉద్యోగులందరూ ఫీల్డ్‌లో ఉంటూ పనులు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లిఖార్జున్, డీఈ(టెక్నికల్) అనిల్ కుమార్, ఏడీఈ పి.శ్రీనివాస రెడ్డి, ఏఈ మహేందర్ పాల్గొన్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో కిషన్ రెడ్డి పర్యటన



గండిని పరిశీలిస్తున్న రావు పద్మ

హన్మకొండ : కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి ఆదివారం హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించనున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకుని, అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లాకు చేరుకుంటారని వివరించారు. జనగామలో ఉదయం 9.30 గంటలకు అల్పాహారం చేసి అక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 12 గంటలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లికి చేరుకుంటారన్నారు. మోరంచపల్లిలో గంట పర్యటిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు రేగొండకు చేరుకుని మధ్యాహ్నం భోజనం చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 3.30 గంటలకు నగరానికి చేరుకుని హనుమకొండ, వరంగల్‌లో వరద ప్రభావిత ముంపు ప్రాంతాలను సందర్శిస్తారు.


భద్రకాళి చెరువును పరిశీలించిన రావు పద్మ

వరంగల్ పోతన నగర్ వద్ద భద్రకాళి చెరువుకు పండిన గండిని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పరిశీలించారు. ఆమె వెంట నాయకులు ప్రీతీష్, ఆకాష్ ఠాకుర్, నదియా, నరేష్, పవన్, గౌతం, వినీత్ ఉన్నారు.

ప్రతికూల పరిస్థితుల్లో..

సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి

● తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకోవాలి
● పంటలో నీరు నిల్వ లేకుండా చూడాలి
● కేవీకే శాస్త్రవేత్త రాజు





డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

కరీమాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కొద్ది రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వివిధ పంటలు నీట మునుగుతున్నాయి. కొన్ని చోట్ల మొక్కలు ఎర్ర బారుతున్నాయి. ఫలితంగా లక్షలాది రూపాయల పెట్టుబడి నీటిపాలు అవుతోంది. దీంతో రైతులు ఘొల్లుమంటున్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల్లో పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు అన్నారు. తొలి దశలో మొక్కల సాంద్రత కాపాడుకుని తర్వాత దశల్లో దిగుబడి తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన పద్ధతుల గురించి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

పత్తి..



వర్షాభావ పరిస్థితులతో పత్తి మొక్కలు సుమారు 30 రోజుల దశలో ఉన్నాయి. వర్షపు నీరు నిలిస్తే ఆకులు ఎర్రగా మారి చనిపోతాయి. ఈ నేపథ్యంలో నీటిని బయటకు పంపి ఎకరాకు 25–30 కిలోల యూరియా, 10–15 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలి. వర్షం తగ్గిన అనంతరం అవసరం మేరకు పొటాషియం నైట్రేట్ 2 శాతం 20 గ్రాములు నీటిలో కలిపి పది రోజులలో రెండు సార్లు పిచికారీ చేయాలి. మొక్కలు వాలిపోతే కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో కలిపి మొక్కల దగ్గర పోయాలి. మొక్క నీరసంగా ఉంటే 13–0–45ను నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ క్రమంలోనే 19–19–19, మల్టి–కె లాంటివి పిచికారీ చేయాలి.

వరి..



నారుమడుల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి. చిన్నమొలకలు అధిక నీటిని తట్టుకోలేవు. ఈ నేపథ్యంలో వెదజల్లే పద్ధతిలో విత్తుకున్న రైతులు పొలాల్లో, మడులలో నిలిచిన నీటిని తొలగించాలి. వర్షాలు తగ్గాక నారు ఎర్రబడే అవకాశముంది. మడిలో మోతాదు ప్రకారం యూరియా వేయాలి. కార్బన్డిజం, మ్యాంకోజెబ్ కలిపి పిచికారీ చేయాలి. నారు కొనలు ఎర్రగా మారితే జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి. ఇక నాటు వేసిన రైతులు వరద ఉధృతి తగ్గగానే యూరియా వేయాలి. అవసరం మేరకు జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి.



మొక్కజొన్న..

మొక్కజొన్నలో అధిక తేమతో భాస్వరం లోపం ఏర్పడి మొక్కలు ఊద రంగులోకి మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఏపీ, 19–19–19 లాంటి యూరియాను వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి. వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

కంది..

అధిక తేమతో మొక్కలలో ఇనుము లోపంతో ఆకులు పసుపు రంగులోకి మారి ఎండి రాలిపోయే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో నివారణకు అన్నభేది, నిమ్మ ఉప్పు కలిపి పైరుపై వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. వర్షం తగ్గిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

మిరప..



మిరప పంట ప్రస్తుతం నారు మడి దశలో ఉంది. ఈ నేపథ్యంలో రైతులు నీరు పోవడానికి కాలువలు చేసి ఉంచాలి. నారుమడిని పాలిథిన్ షీట్‌తో గాని, వరి గడ్డితో గాని వర్షం తగ్గే వరకు కప్పి ఉంచాలి. వర్షం తగ్గాక వేరు కుళ్లు తెగులు రాకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ మోతాదు ప్రకారం నీటిలో కలిపి మొదళ్ల దగ్గర పోయాలి.